ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

ఆదివారం 19 మే 2024



ఎట్టకేలకు సుల్తానాబాద్‌లో రోడ్ల విస్తరణ 8లో..

వైభవంగా వాసవీ మాత జయంతి 8లో..



'స్థానిక' ఎన్నికలపై నజర్

- రిజర్వేషన్లపై అయోమయం
- పాతవి కొనసాగిస్తారా? మారుస్తారా?
- బీసీల రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల దృష్టి స్థానిక సంస్థలపై మళ్లింది. మొన్న ఎమ్మెల్యేల ఎన్నికలు, నిన్న ఎంపీల ఎన్నికలు ముగిశాయి. తమ పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం చెమటోడ్చిన ద్వితీయ శ్రేణి నాయకులు, గ్రామస్థాయి నాయకుల గెలుపు కోసం ఎమ్మెల్యేలు, పార్టీల ఇన్‌చార్జీలు చెమటోడ్చాల్సి ఉంటుంది. వచ్చే నెల 4వ తేదీన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకోనున్నది. గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన ముగియగా, ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతు న్నది. మండల, జిల్లా పరిషత్‌ల పాలకవర్గాల పదవీకాలం జూలై 3వ తేదీన ముగియనున్నది. ఈ ఎన్నికల్లో పాత రిజర్వేషన్లనే అమలుచేస్తారా? లేక చట్టాన్ని సవరించి మళ్లీ రిజర్వేషన్లు ప్రకటిస్తారా అనే విషయమై అయోమయం నెలకొన్నది. 2019లో జరి గిన స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టం-2018ని తీసుకవచ్చింది. ఐదేళ్లకోసారి రొటేషన్ పద్ధతిన ప్రకటించే రిజర్వేషన్లను పదేళ్లకోసారి మార్చాలని చట్టసవరణ చేశారు. ఆ ప్రకారం వెళ్లాలంటే ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. స్థానిక సంస్థల రిజర్వేషన్లంటినీ రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఖరారు చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, బీసీలకు 27 శాతం, జనరల్‌కు 49.5 శాతం రిజర్వేషన్లను అమలుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టిన నేపథ్యంలో అది పూర్తయిన తర్వాత ఆ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు ప్రభుత్వానికి వినతి పత్రాలను కూడా అందజేశారు. ఇవేగాకుండా రిజర్వేషన్ల విషయంలో చట్ట సవరణ చేయకుండా ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారు.

● కొత్త మండలాల ఏర్పాటు..

గడిచిన ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో కొత్తగా కొన్ని మండలాలను ఏర్పాటు చేశారు. రెండు మండలాల్లోని కొన్ని గ్రామాలను కలుపుకుని కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని పాలకుర్తి మండలం ఉండెడ, ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామాలను కొత్తగా ఏర్పాటు చేసిన ఎండపల్లి మండలంలో కలిపారు. ఈ మండలం జగిత్యాల జిల్లాలో ఉండడం గమనార్హం. అలాగే జిల్లాలో గతంలో ఉన్న పంచాయతీల్లో సుగ్లాంపల్లి, పూసాల గ్రామపంచాయతీలను కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పడ్డ సుల్తానాబాద్‌లో విలీనం చేశారు. అంతర్గాం మండలం లింగాపూర్, కుందనపల్లి, రామగుండం మండలంలోని ఎల్కలపల్లి పంచాయతీ పరిధిలోని 2 వార్డులు, రామగిరి మండలం వెంకట్రావుపల్లి పంచాయతీని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. కొత్తగా ఏర్పడ్డ పంచాయతీలతో కలిపి మొత్తం 263 పంచాయతీలకు 2436 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. విలీన గ్రామాల ప్రజలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో లింగాపూర్, కుందనపల్లి, వెంకట్రావుపల్లి, ఎల్కలపల్లిలోని రెండు వార్డులను మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తొలగించారు. వాటికి ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించలేదు. ఈ పంచాయతీలకు రిజర్వేషన్లు ఎలా ఖరారు చేస్తారనే విషయమై చర్చ జరుగుతున్నది. కొత్తగా మరికొన్ని మండలాలు, పంచాయతీలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు ఉన్న నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత తప్పనిసరిగా ప్రభుత్వం రిజర్వేషన్లపై చట్ట సవరణ చేసే అవకాశాలు లేకపోలేదని తెలుస్తున్నది. అయితే గ్రామాల్లో మాత్రం అప్పుడే స్థానిక సంస్థల ఎన్నికలపై ఎక్కడ నలుగురు కలిసినా చర్చ జరుగుతున్నది.

జేఎన్టీయూలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల అధికారి



రిజిష్టర్‌లో సంతకం చేస్తున్న రాష్ట్ర డిప్యూటీ ప్రధాన ఎన్నికల అధికారి మురళీ

రామగిరి, మే 18: జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల(మంథని)ను శనివారం రాష్ట్ర డిప్యూటీ ఎన్నికల అధికారి మురళీమోహన్‌రావు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలసి పరిశీలించారు. కళాశాలలోని రామగుండం, మంథని, ధర్మపురి, పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌కు వేసిన సీల్‌లను తనిఖీ చేసి రిజిష్టర్‌లో సంతకం చేశారు. జూన్ 4న జరగబోయే కౌంటింగ్‌కి సంబంధించి చేస్తున్న ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, కెమెరా మానిటరింగ్ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్‌ల సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ జేఎన్టీయూ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌కు 3 అంచెలా భద్రతను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌పై నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి హనుమానాయక్, తహసీల్దార్ రాంచందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణ భూసేకరణపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో

మంథని, మే 18: మంథని డివిజన్‌లో జాతీయ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిపై తన కార్యాలయంలో మంథని ఆర్డీవో శనివారం ప్రత్యేకంగా సమీక్షించారు. జాతీయ రహదారి భూసేకరణ పెండింగ్ పనులు, భూసేకరణలో కోల్పోతున్న కట్టడాలు, బోర్లు, బావులు, పైపులైన్‌ల అంచనా విలువలను త్వరితగతిన అందించాలని సంబంధిత ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, భూమికి సంబంధించిన పెండింగ్ పనులపై సంబంధిత తహసీల్దార్‌లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రాజయ్య, రాంచందర్, సుమన్, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఆర్ఐలు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు పాల్గొనారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

పెద్దపల్లిటౌన్, మే 18: జిల్లా వ్యాప్తంగా గత నాలుగు, ఐదు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ప్రజాఫ్రంట్, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య అన్నారు. సకాలంలో ఐకేపీ సెంటర్‌లను ప్రారంభించకపోవడం, కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయకపోవడం, అలాగే రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లను అందించకపోవడం వల్ల ధాన్యం తడిసిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని రంగు మారిన, తేమ శాతం లేదని ఆంక్షలు పెట్టకుండా వెంటనే కొనుగోలు చేయాలన్నారు. గత ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లుగా దొడ్డు వడ్లు, సన్న రకాలుగా అని కాకుండా అన్ని వడ్లకు ఐదు వందల రూపాయలు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్, పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్ గాండ్ల మల్లేశం పాల్గొన్నారు.

పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

-అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్



వ్యవసాయ మార్కెట్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లిటౌన్, మే 18: జిల్లాలో యాసంగి పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. శ్యామ్ ప్రసాద్‌లాల్ పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న రైతులతో మాట్లాడి, ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఉన్నందున కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. రైస్‌మిల్లుల వద్ద ధాన్యం కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్ అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- లారీల కొరత లేకుండా చర్యలు.. - ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, మే 18: వడ్ల కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు పక్రియ వేగవంతం చేయాలని, లారీల కొరత లేకుండా చూస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం మండలంలోని వెన్నంపల్లి, మంగపేట, కూనారం, గ్రామాల్లోని సొసైటీ, ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాలను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సందర్శించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వడ్ల కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యాన్ని వారు పరిశీలించారు. లారీల కొరత లేకుండా చూస్తామని కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులెవరు అధైర్యపడవద్దని హామీ ఇచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 80శాతం వడ్ల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని, కొన్ని కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లు మిగిలి ఉన్నాయని సెంటర్ నిర్వాహకులు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. లారీల కొరత లేకుండా చూస్తామని వారు హామీ ఇచ్చారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే ఎలాంటి కట్టింగ్ లేకుండా కొనుగోలు చేస్తుందని రైతులెవరు అధైర్య పడవదన్నారు. మిల్లర్లు కటింగ్ పెడతామంటే మిల్లర్లు చుట్టూ, సెంటర్ నిర్వాహకుల చుట్టూ రైతులు తిరగవద్దని మా దృష్టికి తీసుకు వస్తే ఏలాంటి కట్టింగ్ లేకుండా చూస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. వర్షాకాలంలో రైతులు పంట సాగు ముందుగా ప్రారంభించాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మండల యూత్ అధ్యక్షుడు శివరామకృష్ణ, నాయకులు డొంకెన మొగిలి, సాధనమైన కొమురయ్య, ఎండి ఖలీల్, రణవేన శ్రీనివాస్, బంగారు రమేష్, సబ్బని రాజమల్లు, కలవేన రాజయ్య, వెల్మారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిటౌన్, మే 18: విద్యుత్‌లైన్లు, సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం సరాఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏడీఈ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగంపల్లి, పెద్దపల్లి, టౌన్ టు 11 కేవీఏ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించగలరని కోరారు.

మెట్రో నగరాల స్థాయిలో 'ఖని' అభివృద్ధి

- సింగరేణి క్వార్టర్ల కూల్చివేత వెనుక కారణం అదేనంటున్న అధికారులు - ఒకేవైపు 130ఫీట్ల విస్తరణ - జీప్లస్ వన్‌తో 270షాపుల నిర్మాణం - రూ.19కోట్లతో అంచనాలు



క్వార్టర్లు తొలగించే ప్రతిపాదిత శివాజీనగర్ రోడ్డు



రోడ్డు పక్కన ఉన్న శివాజీనగర్ క్వార్టర్లు



చౌరస్తా నుంచి హనుమాన్‌నగర్ రోడ్డు

గోదావరిఖని, మే 18: గోదావరిఖని ప్రధాన చౌరస్తా పరిసరాల్లోని శివాజీనగర్, గాంధీనగర్, హనుమాన్, ప్రాంతాల్లో రోడ్ల వెడల్పు పేర 82సింగరేణి క్వార్టర్ల కూల్చివేత అంశం మూడు మాసాల్లో అనేక ఆందోళనలకు, అపోహలకు, హైకోర్టు వరకు న్యాయ పోరాటాల వరకు వెళ్లింది. ఇప్పుడు పారిశ్రామిక ప్రాంతంలో మండుతున్న సమస్య.. బాధితులు సంఘాలుగా ఏర్పడి ప్రత్యక్ష పోరాటాలకు, దీక్షలకు సిద్ధపడ్డారు. ఈ కూల్చివేతల వెనుక స్థానిక ప్రభుత్వ ప్రజాప్రతినిధు లు వెనుక ఉండి ఈ విధ్వంసానికి పాల్పడుతున్నార నే విమర్శ తీవ్ర స్థాయిలో ఉన్నది. గోదావరిఖని ప్రధాన చౌరస్తాకు గాంధీనగర్, హనుమాన్‌నగర్ రోడ్లవెడల్పు పేర జరుగుతున్న ఈ తంతగం ఇక్కడ రాజకీయ, సాంఘిక సమస్యగా మారింది. అయితే రోడ్డు వెడల్పు ఒకవైపే చేయడం పట్ల మరింత అపోహలు పెరిగాయి. కానీ సింగరేణి యాజమాన్యం రోడ్డు వెడల్పు కింద 82క్వార్టర్లు కూల్చివేతకు గురవుతున్నాయని, వీరందరికి కౌన్సిలింగ్‌ల ద్వారా ఆర్‌జీ-1 పరిధిలోనే క్వార్టర్లు ఇస్తానంటున్నది. కానీ ఈ క్వార్టర్లలో నివాసముండే సింగరేణి కార్మికులు రోడ్డు పొడవునా చిన్న కొట్లు పెట్టుకుని బ్రతుకుతున్న చిరువ్యాపారులు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. రోడ్డు వెడల్పు పేర జరుగుతున్న కూల్చివేతల వెనుక ఏ అభివృద్ధి నమూనా ఉందో సింగరేణి యాజమాన్యం కానీ, స్థానిక ప్రజాప్రతినిధులు కానీ తెలియజేయకపోవడంతో ఈ సమస్య మరింత జఠిలమైంది. దీని వెనుక అసలు కథ ఏమిటంటే గోదావరిఖని పట్టణానికి మెట్రో పట్టణాల స్థాయిలో సుందీకరణ కోసం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సింగరేణి సీఎండీకి ఈ ప్రతిపాదన చేయడంతో సీఎండీ ఆర్‌జీ-1 అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. న్యూఅశోక నుంచి లక్ష్మీనగర్ వరకు ఎడమ వైపున 40మీటర్లు అంటే 131ఫీట్ల వెడల్పు కోసం మూడు క్వార్టర్ల చొప్పున కూల్చివేసేందుకు ప్రణాళిక చేశారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు మధ్య నుంచి ఈ మేరకు క్వార్టర్లను కూల్చుతారు. ఈ స్థలాన్నంతా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తారని, ప్రభుత్వంలో ఉన్న ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమిస్తారనే అపోహ బలపడింది. అయితే సింగరేణి యాజమాన్యం ఈ 131ఫీట్ల వెడల్పులో అనేక అభివృద్ధి నమూనాలను తయారు చేసింది. ప్రస్తుతం ఉన్న రోడ్డు మధ్యలో 2మీటర్ల డివైడర్‌ను ఏర్పాటు చేయడం, ఇరువైపులా 20ఫీట్ల చొప్పున రోడ్డు నిర్మించడం, ఈ రెండు రోడ్లకు ఇరువైపులా రెండు మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయడం, వాటి క్రింద డ్రైనేజీ వ్యవస్థను ఏర్పర్చడం లాంటి పనులకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఏ వైపునైతే క్వార్టర్లను కూల్చుతున్నారో ఆ వైపున నాలుగు వెడల్పు, 5మీటర్ల లోపలికి చొప్పున జీ ప్లస్ వన్ షాపులను ఏర్పాటు చేయనున్నది. మొత్తం 270 షాపులను రూ.19కోట్లతో సింగరేణి సంస్థనే నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేసింది. ఈ షాపులను ప్రస్తుతం ఉన్న చిరు వ్యాపారులకు అద్దె ప్రాతిపదిన కేటాయించేందుకు సిద్ధప డుతున్నట్లు తెలిసింది. షాపుల ముందు 2మీటర్ల వెడల్పుతో ఓపెన్ ఏరియా, ఆ ముందు రెండు మీటర్ల వెడల్పు పార్కింగ్‌కు కేటాయించేందుకు మ్యాప్‌ను తయారు చేసింది. ఇదికాకుండా షాపుల వెనుకాల ఉండే సింగరేణి క్వార్టర్లకు 20ఫీట్లతో సింగరేణి కాలనీ రోడ్డును వేయనున్నారు. ఈ కాలనీ రోడ్డుకు కూడా ఇరువైపులా రెండు మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు,అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు ఏర్పాటుచేస్తారు. అర్జున్ స్వీట్ హౌస్ ఎదురు నుంచి శివాజీనగర్ బట్టల బజార్ వరకు మొత్తం 700మీటర్లు పొడవుతో 131ఫీట్ల వెడల్పుతో క్వార్టర్ల కూల్చివేతలు జరుగనున్నాయి. ఈ 700మీటర్ల పొడవునా మూడు రోడ్డు మార్గాలు, ఫుట్‌పాత్‌లు, కాలనీరోడ్లు, షాపుల నిర్మాణం జరుగనున్నది. ఇదంతా సింగరేణి అభివృద్ధి చేస్తే రోడ్ల నిర్మాణం రామగుండం కార్పొరేషన్ ద్వారా నిర్మించనున్నట్లు తెలుస్తున్నది. క్వార్టర్ల కౌన్సిలింగ్‌లు నిర్వహించి జూన్ 15తరువాత కూల్చివేతలకు సింగరేణి యాజమాన్యం పూనుకోనున్నట్లు తెలిసింది. ఈ అభివృద్ధి ద్వారా గోదావరిఖని ప్రధానకేంద్రంలో హైదరాబాద్ స్థాయి అందంగా కనిపిస్తుందని, సౌకర్యం పెరుగుతుందని, లక్ష్మీనగర్ పార్కింగ్ సమస్య తీరుతుందని సింగరేణి భావిస్తున్నది. ఈ ప్రాంతంలో ఒకటి అర పట్టాలు ఉన్నప్పటికీ వాటిని రద్దు చేసేందుకు రెవెన్యూ అధికారులు కూడా సంసిద్ధంగా ఉన్నట్లు సమాచారం. గాంధీనగర్ రెండు రోడ్లు, ఓల్డ్ అశోక ముందు సింగరేణి ప్రాంతం అంతా రోడ్ల వెడల్పునకు మాత్రమే పరిమితం చేయనున్నారు.



ఖని మెయిన్ చౌరస్తా నుంచి కుడి వైపుకు క్వార్టర్లు తొలగించే ప్రాంతం

చెట్టు పైనుంచి పడి జీపీ కార్మికుడికి గాయాలు

కరీంనగర్ రూరల్, మే 18: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో చెట్టు పైనుంచి పడి పంచాయతీ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం విద్యుత్ తీగెలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగిస్తుండగా పంచాయతీ కార్మికుడు ర్యాకం శంకర్ చెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే శంకర్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

30 నుంచి పెద్ద హనుమాన్ జయంత్యుత్సవాలు

● ఇంకా ఏర్పాటు కాని సమన్వయ సమావేశం

మల్యాల, మే 18: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు జరుగనుండగా అందుకు తగిన ఏర్పాట్లకు ప్రతి ఏటా నిర్వహించే సమన్వయ సమావేశం ఇంత వరకు నిర్వహించలేదు. దీంతో జయంతి ఏర్పాట్లపై ఎవరికి వారే అన్న తీరుగా మారుతుంది. ప్రతి ఏటా జయంత్యుత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు కొండగట్టు వస్తుంటారు. దీనికి పదిహేను రోజులకు ముందుగానే ఎమ్మెల్యే, కలెక్టర్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులతో ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై చర్చించి తగు చర్యలు చేపట్టడానికి సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తుంటారు. అయితే పెద్ద జయంతి వేడుకలకు మరో పది రోజుల గడువు మాత్రమే ఉంది. ఆలయానికి రంగులు వేసే పనులు మాత్రమే చేపట్టగా సమన్వయ సమావేశానికి ఏర్పాట్లు చేయలేదు. ఉత్సవాల సందర్భంగా పోలీసు, పంచాయతీ, రెవెన్యూ, మిషన్ భగీరథ, ఆర్టీసీ, ఫైర్, నీటి పారుదల శాఖ తదితర శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించనుండగా ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి కేటాయించిన పనులలో ఇది వరకే నిమగ్నం కావాల్సి ఉంది. గత చిన్న జయంతి ఏర్పాట్లే ఇప్పుడు కొనసాగించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నప్పటికీ ఉత్సవాల సందర్భాలలో ప్రతి ఏటా భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థులతో వీసీ సంకశాల మల్లేశ్

వేములవాడ టౌన్, మే 18 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి సంకశాల మల్లేశ్ విద్యార్థులకు సూచించారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన బంగారు పతకాల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నిరంతరం సాధన చేస్తే తప్పక లక్ష్యాలని సాధించవచ్చన్నారు.ప్రతి విద్యార్థి రోజుకు కనీసం ఐద నుండి ఆరు గంటలు సాధన చేస్తే లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. నేటి యువత టీవీ, సెల్‌ఫోన్, సినిమా వంటి మాధ్యమాలకి బానిసలు కావడం బాధాకరమని, వాటిని విద్యార్థులు కేవలం తమ విద్య, విజ్ఞానం, వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడానికి మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. రానున్న పీజీ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ పోటీ పరీక్షలలో విజయం సాధించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుని దానికనుగుణంగా సన్నద్ధం కావాలని సూచించారు. 2020-23 సంవత్సరానికి గాను అకాడమిక్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పున్నశాస్త్రి, సనా, అరుణ్, మేహ, నందిని, రేవతి, రిషీంద్ర, కేజీయా, రజిత, సౌజన్య, సౌమ్య, భార్గవి, రాజు, రఘు, అజయ్, అనిల్‌లకు బంగారు పతకాలను అందజేశారు. ఈ సమావేశంలో టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారి సురేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ మధురాజేశ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వి. రాధాకృష్ణమాచార్యులు, కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, పరుశురాములు, జయవర్ధన్ జగన్నాథచార్యులు తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

కోనరావుపేట, మే 18 : కోనరావుపేట మండలం మల్కపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు గెంటె రాములు (102) శనివారం మృతి చెందాడు. రాములు ఆరోగ్యంగా ఉంటూ తన పని తాను చేసుకునేవాడు. వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. రామయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

నాచుపల్లి జేఎన్‌టీయూకు ఐఎస్‌వో గుర్తింపు

కొడిమ్యాల, మే 18: కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్‌టీయూ యుసీఈజే(అటానమస్)ఇంజనీరింగ్ కళాశాలకు ఐఎస్‌వో (ఇంటర్‌నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డ్జేషన్)గుర్తింపు లభించింది. హైదరాబాద్ జేఎన్‌టీయూ కార్యాలయంలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్ హైదరాబాదు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డా.. కె. వెంకటేశ్వర్‌రావు సమక్షంలో సర్టిఫికెట్‌ను అందించారు. ఈ నెల 15న హెచ్‌వైఎం ఇంటర్‌నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు జేఎన్‌టీయూ కళాశాలను సందర్శించి సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 2027 వరకు గుర్తింపు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.. టి. వేణుగోపాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

పురుగులమందు తాగిన యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, మే 18 : మద్యం మత్తులో పురుగుల మందు తాగిన మంద నరేష్(38) అనే యువకుడు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన నరేష్ మద్యానికి బానిసగా మారటంతో అతని భార్య పుట్టింటికి వెళ్లి కాపురానికి రావటంలేదు. దీంతో మనస్తాపం చెందిన నరేష్ ఈ నెల 4న మద్యంలో పురుగుల మందు కలిపి తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు డబ్బాతో యువకుడి ఆత్మహత్యాయత్నం



బాధితుడితో మాట్లాడుతున్న పోలీసులు

చందుర్తి, మే 18: ఆరు నెలలుగా పోలీసులు వేధిస్తున్నారంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎన్గల్ గ్రామానికి చెందిన మ్యాకల జలేందర్ అనే యువకుడు శనివారం పురుగుల మందు డబ్బాతో వచ్చి ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన మ్యాకల జలేందర్‌కు అదే గ్రామానికి చెందిన మల్లేశంకు ఆరు నెలలుగా ఇళ్ల స్థలాల సరిహద్దు వివాదం కొనసాగుతోంది. జలేందర్‌ను పలుమార్లు పోలీస్ స్టేషన్‌కు పిలిచి కేసు నమోదు చేస్తామంటూ పోలీసులు వేధిస్తున్నారంటూ ఏప్రిల్ 8న ఎస్పీని కలిశాడు. విచారణ చేపట్టాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లును ఎస్పీ ఆదేశించారు. విచారణ చేపట్టిన సీఐ ఎవరి హద్దుల్లో వారే ఉండాలన్నారు. మల్లేశం వెళ్లి ఫిర్యాదు చేయడంతో పిలిపించి ఇబ్బందులు పెడుతున్నారని, తాను ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జలేందర్ వాపోయాడు. శనివారం నిర్మాణం కోసం వివాదంలో ఉన్న స్థలంలో మల్లేశం ఇసుక పోయించాడు. దీంతో జలేందర్ తన తల్లి ఎల్లవ్వతో, చెల్లె పావనితో కలిసి పురుగుల మందు డబ్బాను వెంట తీసుకుని ఠాణాకు వెళ్లాడు. ఆత్మహత్యకు యత్నించగా అనుమానం వచ్చి అక్కడే ఉన్న హెడ్‌కానిస్టేబుల్ రంగస్వామి అడ్డుకున్నారు. అనంతరం చందుర్తి సీఐ హామీతో బాధితుడి కుటుంబ సభ్యులు వెనుదిరిగారు. ఈ విషయమై చందుర్తి ఎస్ఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా తాను జలేందర్‌ను స్టేషన్‌కు పిలిపించలేదని గంగాధర్ అనే వ్యక్తి ఠాణాకు వచ్చి పురుగుల మందు డబ్బాతో బెదిరించాడని వివరించారు.

'ఎప్‌సెట్'-24లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ఘన విజయం

కరీంనగర్ టౌన్, మే 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎప్‌సెట్) ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలతో ఘన విజయం సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్త ంచేశారు. శనివారం ఎప్‌సెట్‌లో అద్భుత ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యార్థులు వి.హాసిని 114వ ర్యాంకు, ఎన్.హేమంత్ 157, జి.శ్రీహాస్ 166, కె.సుప్రియ 296, ఎన్.జ్ఞానద 480, వి.శ్రీముఖి 568, ఎం.వర్షిత్ 575, జి.సాయిమంజునాథ్‌రెడ్డి 610, పి.జ్యోతిర్మయిరెడ్డి 863, శ్రీవెన్నెల 876, తేజస్విని 942, ఏ.శివవరుణ్ 973, సిహెచ్.అనూహ్య 950, పి.శ్రీనాథ్ 986, మలిహాఫాతిమా 992వ ర్యాంకు సాధించారని అన్నారు. 16 మంది విద్యార్థులు 1,000లోపు ర్యాంకు సాధించడం విశేషమని అన్నారు. 29 మంది విద్యార్థులు 2వేలలోపు, 63 మంది విద్యార్థులు 3వేలలోపు, 116 మంది విద్యార్థులు 5వేలలోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిప్రతిష్ఠలను నిలబెట్టారని అన్నారు. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక అత్యుద్భుత ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమని ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. ఇటీవల ప్రకటించిన ఐఐటీ మెయిన్ ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ విద్యార్థులు. 450 మంది ఐఐటీ అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. ఎప్‌సెట్-24 ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

'ఎప్‌సెట్'-24 ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థుల జయకేతనం

కరీంనగర్ టౌన్, మే 18: ఎప్‌సెట్-24 ఫలితాల్లో ట్రినిటీ జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలతో విజయకేతనం ఎగురవేశారు. శనివారం రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను స్థానిక ట్రినిటీ కళాశాలలో ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ట్రినిటీలో విద్యనభ్యసించిన హానికర్ అత్యుత్తమ ర్యాంకు 44 సాధించారని అన్నారు. అలాగే వివిధ విభాగాల్లో పి.ప్రణయ్ 773వ ర్యాంకు, వై.అవ్లేష 1254, వి.శ్రీతేజ 1255, వై.అశ్విత 1551, సిహెచ్.విఘ్నేష్ 1624, ఆయేషా మహజబీన్ 1627, ఫిల్జాఅతిక్ 1748, ఎస్.శ్రీలక్ష్మి 2159, ఎం.హర్షవర్ధన్ 2280, ఎన్.గంగశ్రీ 2372, పి.శ్రీదీప 2682, సిహెచ్.రంజిత 2815, మబిహా ఫాతిమా 2913 ర్యాంకులు సాధించారని అన్నారు. అలాగే ఎం.అశీష్ 2954, కె.రాణి 2996, వి.నాగజ్యోతి 3059, ఎ.అర్షిత 3266, పి.స్మరణీ 3502, అంశారా సహర్ష్ 3877, అతిఫా ఫాతిమా 4012, ఎల్.ప్రతిమ 4101, బుష్రా బమాన్ 4255, బి.వైష్ణవి 4302, జి.దివ్య 4422, పి.హంసిని 4609, జె.కీర్తన 5041, ఎన్.దేవిక కృష్ణన్ 5050, బి.శుతి 5060, కె.అర్చన 5225, పి.జ్యోతిప్రకాశ్ 5267, సిహెచ్.సాయి మోహిత్‌రెడ్డి 5343, కె.సాయి ప్రద్యుమ్న ఆచార్య 6288, జె.హేమశ్రీ 6655, ఎల్.గణేశ్ 6729, సిహెచ్.జాన్ 7578, ఆర్.లక్ష్మిప్రసన్న 7675, రతన్‌కుమార్ 7757 పి.దుర్గాభవాని 8016, ఎ.సాహిత్య 8273, కె.శశాంక్ 8329, ఎ.వైష్ణవి 8415, డి.అలేఖ్య 8473, బి.కార్తీక్ 8580, పి.వినయ్ 9342, కె.శరణ్య 9591, ఎస్.స్నేహిత 9757 ర్యాంకులు సాధించారని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల ఫౌండర్ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి

ధాన్యం కొనాలని రాస్తారోకో

బీర్‌పూర్, మే 18: కొనుగోలు కేంద్రాలలో కుప్పలు కుప్పలుగా పేరుకు పోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో చేపట్టారు. బీర్‌పూర్ మండలంలోని కందెనకుంట సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని నర్సింహాలపల్లి, కందెనకుంటకు చెందిన రైతులు నర్సింహాలపల్లి శ్రీకృష్ణ యాదవ సంఘం సమీపంలో ప్రధాన రహదారిపై బైఠాయించి సుమారుగా గంటపాటు రాస్తారోకో చేశారు. రైతుల రాస్తా రోకో కారణంగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. ఈ సందర్భంగా రైతులు, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యంలో కోతలు విధించకుండా చూడాలని, అంతే కాకుండా అన్ని రకాల ధాన్యానికి 500 రూపాయలు బోనస్ చెల్లించి నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి శీలం రమేష్, నాయకులు మెరుగు రాజేశం, శీలం రవింధర్, సుశీన్, తాడుక మల్లేశం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు



దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా చందనోత్సవం

- ఆరో రోజూ ప్రత్యేక పూజలు
- పెద్ద సంఖ్యలో భక్తుల రాక

ధర్మపురి, మే 18: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం చందనోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 13 నుంచి ప్రారంభమైన నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసపూర్వక, షోడశ ఉపచార పూజ, సహస్ర నామార్చన నిర్వహించారు. పంచోప నిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్త హారతులు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. యోగ, ఉగ్ర నారసింహులను అందంగా చందనంతో అలంకరించారు. అలాగే లోక కల్యాణార్థం నిత్యం సుదర్శన, నారసింహ, రుద్ర హోమాలు నిర్వహించారు. గోదావరిలో స్నానాలు చేసిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


సమ్మయ్య(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మే 18: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని శనివారం వెనుక నుంచి ఓ వాహనం అతివేగంగా వచ్చి వేగంగా ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్పూర్ గ్రామానికి చెందిన మండల సమ్మయ్య(55) తన పనుల నిమిత్తం సైకిల్‌పై ఇందిరానగర్‌కు వెళ్లాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి సైకిల్‌పై వస్తున్న క్రమంలో జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు వస్తున్న వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన యువతిపై కేసు

తిమ్మాపూర్(మానకొండూర్) మే 18: ప్రేమ పేరుతో డబ్బులు దండుకొని ఆస్ట్రేలియాకు వెళ్లిన ఓ యువతిపై ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,, తిమ్మాపూర్‌కు చెందిన మాదన నాగరాజు అనే యువకుడు యోగా నిమిత్తం ఈశా ఫౌండేషన్‌కు వెళ్లాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంకు చెందిన కమల సంధ్య ప్రియాంకతో నాగరాజుకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. కొద్ది నెలల క్రితం వీరిద్దరు తిమ్మాపూర్‌కు రాగా నాగరాజు తండ్రి మల్లయ్య ఇంట్లోకి రానివ్వలేదు. దీంతో అదే గ్రామంలోని ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నారు.. కాగా నాగరాజు ఓ ఆసుపత్రిలో తన పేరున ఉన్న భాగస్వామ్యంను రద్దు చేసుకోవడంతో రూ. 16లక్షలు వచ్చినట్లు తెలిపారు. ఆ మొత్తాన్ని ప్రియాంక తన బంధువుల అకౌంట్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నది. అనంతరం ఆస్ట్రేలియాకు వెళ్లి మూడు లక్షలతో పాటు నాగరాజు వాటా ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో తన కుమారుడు తనను భూమి కోసం తండ్రిని వేధిస్తున్నట్లు తెలిపారు. కొంత కాలానికి ప్రియురాలు మోసం చేసిందని తీవ్ర మనస్తాపానికి గురై ఫినాయిల్ తాగి ఆసుపత్రిలో చికిత్స పొందున్నతున్నాడు. నాగరాజు తండ్రి మల్లయ్య పిర్యాదు మేరకు కమల సంధ్య ప్రయాంకపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 18: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన తేజస్వినికి అనే యువతికి తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మాపూర్‌కు చెందిన యువకుడు తేజ తన తల్లి కరికె వనిత, సోదరి తేజస్వినితో కలిసి బైక్‌పై మండల కేంద్రం మీదుగా వెళ్తున్నాడు. నారాయణపూర్‌కు చెందిన యువకుడు ఇర్ఫాన్ తన జీపుతో బైక్‌ను ఢీకొట్టాడు. ఘటనలో తేజస్వినికి తీవ్ర గాయాలవగా తేజ, వనిత స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తేజస్విని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెస్టారెంట్, టిఫిన్ సెంటర్లపై సివిల్ సప్లై అధికారుల దాడులు


డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

కరీంనగర్ మే 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ పట్టణంలో పలు హోటల్స్, టిఫిన్ సెంటర్ల, రెస్టారెంట్‌ల్లో శనివారం సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్‌లలో అక్రమంగా వినియోగిస్తున్న డొమెస్టిక్ (గృహావసరాల) సిలిండర్లను వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. సిలిండర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ప్రభుత్వం గృహలక్ష్మీ పథకంలో భాగంగా 500రూపాయలకే లబ్ధిదారులకు సిలిండ్‌లను అందజేస్తోంది. గృహ అవసరాలకు అందించే సిలిండర్ ధర 1000రూపాయలు ఉండగా అందులో కొన్ని గృహలక్ష్మీ పథకం కింద 500రూపాయలకే అందిస్తోంది. కమర్షియల్ సిలిండర్ 2,300 రూపాయలకు మార్కెట్ ధర ఉంది. అయితే సిలిండ్‌లు కాస్తా పక్కదారి పట్టి హోటళ్లు, రెస్టారెంట్‌లు, టిఫిన్ సెంటర్ల నిర్వహకులు డొమెస్టిక్ సిలిండర్‌లను ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి లక్షల్లో గండిపడటమే కాకుండా పేదల కోసం ప్రవేశపెట్టిన గృహలక్ష్మీ పథకం లబ్ధిదారులకు నష్టం వాటిల్లుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్ సప్లై అధికారి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం హోటళ్లు, రెస్టారెంట్‌లు, టిఫిన్ సెంటర్లపై దాడులు నిర్వహించి 96 సిలిండర్‌లను సీజ్ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డి తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. గృహ అవసరాలకు వాడాల్సిన సిలిండర్లను కమర్షియల్‌కు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డి తెలిపారు.

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న రైతులు


మామిడిపల్లిలో అడ్డుకున్న రైతులు

కోనరావుపేట, మే 18: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని అన్నారు. కొంతమంది ఇసుకను తోడేస్తున్నారని అక్రమంగా తరలించి కూడా అమ్ముకుంటున్నారని అన్నారు. ఇసుక రీచ్‌ను మామిడిపల్లిలో బంద్ చేసి వేరే చోట ఇవ్వాలని అన్నారు. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఆర్ఐ రాజశేఖర్ చేరుకొని రైతులతో మాట్లాడి లోతుగా తీయకుండా మరోచోట ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఇసుక రీచ్‌ను నడవనిచ్చారు.

చిరుత దాడిలో దూడ మృతి

రుద్రంగి, మే 18: రుద్రంగి మండల కేంద్రంలో చిరుత దాడిలో దూడ మృతి చెందింది. మండల కేంద్రానికి ద్రానికి చెందిన చిట్టపురం గంగాధర్ అనే రైతు నల్లగుట్ట ప్రాంతంలోని గోరిలాల్వ దగ్గర తన పొలం వద్ద రోజు మాదిరిగానే దూడను కట్టేశాడు. ఉదయం పోలం వద్దకు వేళ్లి చూసే సరికి దూడ మృతి చెంది ఉందని, చిరుతపులి ఆనవాళ్లు ఉండడంతో రాత్రి సమయంలో చిరుత పులి దాడి చేసి దూడను చంపిందని భాదిత రైతు తెలిపాడు. నల్లగుట్ట ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే 18: మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. శనివారం ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పురోహితుడు వామన చక్రపాణి ఆధ్వర్యంలో పురోహితులు వేదమంత్రోచ్ఛారణలతో భాజా భజంత్రీల మధ్య అంగరంగ వైభ వంగా కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు, కృష్ణారావులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జెట్టి లింగం, నాయకులు కొమ్ముల రాజేశ్వర్‌రెడ్డి, మామాడి నారాయణరెడ్డి, గోరుమం తుల ప్రవీణ్ కుమార్, కల్లెడ గంగాధర్, ఏలేటి వినోద్, చిలువేరి నరేందర్, రాజేందర్, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


వేంపేటలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కథలాపూర్, మే 18 : మండలంలోని దుంపెటలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారల కల్యాణం అర్చకులు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు కావడంతో పంచామృత అభిషేకాలు, పుష్పార్చన, మంగళహారతి, మంత్ర పుష్పం, విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు నారంభట్ల వామనశర్మ, హరిప్రసాద్‌శర్మ, గిరధర్ శర్మ, భరద్వాజ్, రాజుశర్మ నేతృత్వంలో కల్యాణం కమనీయంగా జరిగింది. విశ్వక్సేన ఆరాధన, మహా గణపతి పూజ, పుణ్యాహవచనం, గౌరీపూజ, అంకురారోపణ, ఎదురుకోలు, గరుడ వాహన పూజ, విశేష హవనాలు వంటి కార్యక్రమాలు జరిపారు. కల్యాణం వీక్షించేందుకు చుట్టు పక్కన గ్రామాల నుంచి మహిళలు తర లివచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, మే 18: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించు కున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఎండ తీవ్రతతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వందలాదిగా భక్తులు స్వామి వారి సన్నిధిలో హనుమాన్ దీక్ష తీసుకున్నారు. భక్తులకు కావల్సిన ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవే క్షించారు. గదుల కొరతతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురి అయ్యారు. రా త్రులు ఆరుబయటనే నిద్రించారు.


కొండగట్టులో భక్తుల సందడి

నూతన చట్టాలపై అవగాహన కల్పించాలి

- డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వెంకటేశ్వర్లు

కరీంనగర్ లీగల్, మే 18: కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన మార్పులు, చేర్పులతో ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వింజమూరి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్త అడిషనల్, అ సిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వింజమూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతీ మొదటి శనివారం పోలీస్ అధికారుల సమీక్షా సమావేశంలో వారికి నూతన చట్టాలపై అవగాహన కల్పించాలని, ప్రతి మూడో శనివారం ప్రాసిక్యూటర్ల సమావేశంలో కూడా వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాసిక్యూటర్లు కేసుల విచారణ సమయంలో ఆయా కేసుల పూర్తి అవగాహనతో ఉండాలని, సంబంధిత న్యాయమూర్తులతో సమన్వయంతో కలిసి వెళ్లాలని అన్నారు. అనంతరం కరీంనగర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరస్వామి నూతన చట్టాలను వివరించారు. సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జ్యోతిరెడ్డి, నర్సింగారావు, తుమికి పవన్‌కుమార్, జూలురు శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, శరత్, పెంట శ్రీనివాస్, కాసారం మల్లేశం, జంగిలి మల్లికార్జున్, సీనియర్ ఏపీపీ మురళీధర్‌రావు, వసంత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మందమర్రిటౌన్, మే 18: పట్టణంలోని రాష్ట్రీయ రహదారి జీఎం కార్యాలయం వెళ్లే రోడ్డు వద్ద శనివారం రాత్రి వాహనం ఢీకొని కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని వావిలాల గ్రామానికి చెందిన కుంబం రాధమ్మ (60) అక్కడికక్కడే మృతిచెందింది. రాధమ్మ మందమర్రిలోని కూతురును చూసేందుకు జమ్మికుంట నుంచి మందమర్రికి వచ్చింది. మందమర్రిలో బస్సు దిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా బెల్లంపల్లి వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న ఓ వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుం బీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అష్ట కష్టాలు

- డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సౌకర్యాలు నిల్
- ఉండలేక తాళాలు వేసిన వెళ్తున్న లబ్ధిదారులు



పోతారం గణేశ్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

సారంగాపూర్, మే 18: అక్కడ తాగునీటి సౌకర్యం ఉండదు.. విద్యుత్ సౌకర్యం అసలే లేదు. ఇక డ్రెయినేజీ నిర్మాణం పూర్తి కాక ఇళ్ల మధ్యనే ఆ మురుగు పారుతూ ఉంటుంది. ఆఘమేఘాల మీద ఇళ్లు నిర్మించినా అంతర్గత రహదారులు మాత్రం ఇప్పటికీ దిక్కు లేదు. ఇదంతా సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామంలో గల గణేష్‌పల్లిలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిస్థితి. కనీస వసతులు లేకున్నా కొందరు తప్పని పరిస్థితుల్లో ఆ ఇళ్లలోనూ ఉంటున్నా మరి కొందరైతే తాము ఇక్కడ ఉండలేమంటూ ఊరికి దగ్గరగానే అద్దె గదుల్లో ఉంటున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాన పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామంలో గల గణేషపల్లిలో 20 ఇళ్లు నిర్మించారు. వీటిని టాటరీ పద్ధతిలో గత సంవత్సరం లబ్ధిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఇళ్లు మాత్రం పంపిణీ చేశారు కానీ వాటిల్లో కనీస సౌకర్యాలు మాత్రం కల్పించలేకపోయారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసౌకర్యాల మధ్యనే లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో ప్రధాన రహదారి నుంచి తీగలు లాగి ఇళ్లలో అమర్చుకున్నారు. దీంతో గాలి వానకు తీగలు తెగిపోవడంలో కరెంట్ అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంది. తాగునీటి సౌకర్యం లేక సమీపంలో ఉన్న బోరు బావుల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మిషన్ బగీరథ నీరు వస్తున్నా అది కూడా మూడు రోజులకు ఒక సారి రావడంతో తాగు నీటికి తిప్పలు తప్పడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. మురుగు నీరు కాలువలో నిలిచి పోవిడంతో దోమల బెడద తీవ్రమైంది. దీంతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని లబ్ది దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు నిర్మించి ఏళ్లు గడిచినా సీసీ రహదారుల నిర్మాణాలు ఇప్పటికీ లేకపోవడం గమనార్హం. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇక్కట్లు మరింత పెరుగుతాయిఇ. ఇళ్ల ముందే వర్షపు నీరు నిలవడం, డ్రెయినేజీల్లో నిరు నిండి దుర్గంధం వెదజల్లడం వంటి సమస్యలతో లబ్ధిదారులు ఉండలేకపోతున్నారు. వసతులు లేక పోవడంతో లబ్ది దారులు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లి పోతున్నారు. నిలువ నీడ లేని కొంత మంది మాత్రం అక్కడే ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించేందుకు రూ. 25లక్షలతో విద్యుత్, మంచినీటి సదుపాయం, రహదారుల నిర్మాణంతో పాటు మరిన్ని వసతులు కల్పించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాక సమస్యలతో సహవాసం చేయల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పూర్తి చేయని డ్రెయినేజీ

కరెంట్ సౌకర్యం ఏర్పాటు చేయాలి..



కరెంట్ సౌకర్యం లేక పోవడంలో రోడ్డు నంచి తీగలు లాగి అమర్చుకున్నాం. గాలి వచ్చినప్పుడు కరెంట్ పోతుంది. దీంతో చీకట్లో ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. సౌకర్యాలు కల్పించేలా చూడాలి. - సంద్రుగుల లక్ష్మి

నీరు రావడం లేదు.



నీటి సౌకర్యం లేక చపోవడంలో సమీపంలో ఉన్న బోరు బావుల వద్దకు వెళ్తున్నాం. మిషన్ బగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. తాగు నీటికి కొరత ఉండటంతో పొదుపుగా వాడుకుంటున్నాం. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి. - రాజవ్వ

ఘనంగా ఆరాధన మహోత్సవాలు

మంథని, మే 18: మంథని పట్టణంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నిర్మించి 3 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మూడవసారి ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమగుండం ఏర్పాటుచేసి స్వామి వారికి అభిషేకం అర్చనలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెంత్రి రమ-సురేష్‌రెడ్డి, వైస్‌చైర్మన్ శ్రీపతి బానయ్య, కాంగ్రెస్ నేతలు ఇనుముల సతీస్, గుండా పాపారావు, నక్క శంకర్, కొట్టె రమేష్, కౌన్సిలర్లు వీకే రవి, చొప్పకట్ల హన్మంతు, కుర్రు లింగయ్య, ఆలయ కమిటీ నిర్వాహకులు మధూకర్, తిరుమలేష్, భద్రయ్య, ఈశ్వరాచారిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ పెంత్రి రమ-సురేష్‌రెడ్డి ఆలయ కమిటీ తరుపు ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం

మంథనిరూరల్, మే 18: మండలంలోని కన్నాల గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కళ్యాణోత్సవ కార్యక్రమాలు శనివారం వేదపండితులు వైభవంగా ప్రారంభించారు. గర్భాలయంలోని స్వామివారి మూల విరాట్‌కు, ఆలయ అవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసిన అనంతరం కళ్యాణోత్సవ వేడుకలను వేదోక్తంగా ప్రారంభించారు. ఆదివారం రాత్రి 7:30 గంటలకు శ్రీభూనీల సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా ఆలయ అవరణలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈనెల 23వ తేది వరకు కళ్యాణోత్సవ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

శిక్షణ శిబిరాన్ని సందర్శించిన డీవైఎస్‌వో

జూలపల్లి, మే 18 : మండల కేంద్రంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న వాలిబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం డివైఎస్ఓ సురేష్ సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా డివైఎస్ఓ సురేష్ మాట్లాడుతూ వేసవిలో శిక్షణ పొందుతున్నా వాలీబాల్ క్రీడాకారులు క్రీడలపై దృష్టిసారించి రాణించాలన్నారు. క్రీడలు మానసిక ఆనందాన్ని శారీరక దృడత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. అలాగే క్రీడాకారులకు ఉద్యోగ నియామకాల్లో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో వాలీబాల్ కోచ్ బొమ్మనవేని సతీష్, సీనియర్ క్రీడాకారులు వెంకటేశ్, రాజు, సత్యనారాయణ, రాకేష్ పలువురు పాల్గొన్నారు.

ఎంసెట్‌లో ఖని విద్యార్థినికి 1093 ర్యాంక్

కోల్‌సిటీటౌన్, మే 18: శనివారం విడుదలయిన ఎంసెట్ ఫలితాల్లో గోదావరిఖని చంద్రబాబుకాలనీకి చెందిన పెంచాల అనన్య 1093 ర్యాంక్ సాధించింది. జేఈఈ మెయిన్‌లో కూడా ఆలిండియా ఓబీసీ క్యాటగిరిలో 15వేల ర్యాంక్ అనన్య సాధించింది. స్థానిక కృష్ణవేణి స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ హైదరాబాద్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసింది. ఇంటర్‌లో 988 మార్కులు సాధించింది. తండ్రి సమ్మయ్య రేడియం షాపునడిస్తున్నాడు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

గణేశ్‌నగర్, మే 18: వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. విద్యా సంవత్సరం చివరి దశకు వచ్చినా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదని అన్నారు. 2022 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు జిల్లా బీసీ సంక్షేమ శాఖలోనే 114కోట్ల రూపాయల బకాయిలు పేరుకు పోయాయని తెలిపారు. తక్షణమే ఫీజు బకాయిలు విడుదల చేసి విద్యార్థులను, కళాశాల యాజమాన్యాలను ఆదుకోవాలని కోరారు.

విదేశీ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మే 18: 2024-25 సంవత్సరానికి కరీంనగర్ జిల్లాలోని విదేశాల్లో చదివే గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఉపకార వేతనానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్ స్థాయి పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ప్రోగ్రాంలో చదవాలనుకునే గిరిజన విద్యార్థిని విద్యార్థులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఎంపికైన గిరిజన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన గిరిజన విద్యార్థిని విద్యార్థులు ఈనెల31లోగా https://overseas.tribal.gov.in/ వెబ్‌సైట్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు.

'ప్రైవేట్ విద్యాసంస్థలపై నిఘా కరువు'

భగత్‌నగర్, మే 18: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలపై అధికారుల నిఘా కరువైందని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అన్నారు. ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థలపై పర్యవేక్షణ కరువైందన్నారు. జిల్లా విద్యాధికారి కార్యాలయంలో జరుగుతున్న చర్యలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎట్టకేలకు సుల్తానాబాద్‌లో రోడ్ల విస్తరణ



శివాలయం రోడ్డులో కొనసాగుతున్న రోడ్డు వెడల్పు పనులు



వేణుగోపాలస్వామి ఆలయం రోడ్డులో సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

సుల్తానాబాద్, మే 18: సుల్తానాబాద్ పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభం అయ్యాయి. దశాబ్ద కాలం నుంచి రోడ్ల విస్తరణ పనులు చేపట్టడానికి అప్పటి గ్రామ పంచాయతీ, ఇప్పటి మున్సిపల్ పాలకవర్గం అనేక దఫాలుగా నిర్ణయాలు తీసుకున్నాయి. పలుసార్లు వెడల్పులో భాగంగా ఎంత మేరకు కూల్చివేయాలన్న విషయమై అంతటా మార్కింగ్ కూడా ఇచ్చారు. కానీ పనులు ముందుకు సాగలేదు. అనేకసార్లు పనులు చేపట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. భూమి పూజలు జరిగాయి. కానీ అవి అంతవరకే ఆగిపోయాయి. కొన్ని నెలల కిందట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన గాజుల లక్ష్మీరాజమల్లు ఎమ్మెల్యే సహకారంతో పాలకవర్గం ప్రోత్సాహంతో ఆయా వార్డుల ప్రజల సమ్మతితో నెల రోజులక్రితం రోడ్డు వెడల్పుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న ఇళ్లను కూల్చివేస్తున్నారు.

దశాబ్దాల క్రితం ప్రతిపాదనలు

సుల్తానాబాద్ పట్టణం రోజురోజుకు జనభాపరంగా, అభివృద్ధి పరంగానూ విస్తరిస్తోంది. రాకపోకలు పెరిగిపోయాయి. ప్రస్తుతం ఉన్న ఇరుకు రోడ్ల మూలంగా నిత్యం అనేక సమస్యలు ఎదరవుతున్నాయి. సుల్తానాబాద్ పాత జెండా చౌరస్తా నుంచి రాజీవ్ రహదారి చెరువురోడ్డు వరకు ఉన్న రోడ్డు మరీ ఇరుకుగా ఉండడంతో ఈ రోడ్డు విస్తరణ పనులకు దశాబ్దాల నుంచి ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ రోడ్డును విస్తరించడం వలన పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్,ఓదెల వైపు వెళ్లే వాహనాలు బస్టాండ్ మీదుగా తెలంగాణ చౌరస్తా మీదుగా కాకుండా నేరుగా పాత జెండా మజీద్ చైరస్తా వరకు వెళ్ళవచ్చు. అలాగే అయా మండలాల నుంచి వచ్చేవారు కూడా పెద్దపల్లి వెళ్లాలంటే మండల పరిషత్ రోడ్డుకు పోకుండా నేరుగా రాజీవ్ రహదారిని చేరవచ్చు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు విస్తరణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. చెరువు కట్ట రాజీవ్ రహదారి నుంచి ప్రారంభం అయిన విస్తరణ పనులు పాత జెండా వరకు పూర్తి అయ్యాయి. ఒక పక్క కూల్చివేతలు జరుగగా డ్రైనేజీ నిర్మాణాలు కూడా వెంట వెంటనే చేస్తున్నారు. ప్రస్తుతం పాత జెండా నుంచి శివాలయం వరకు కొనసాగుతున్నాయి, ఆ తర్వాత శివాలయం నుంచి నీరుకుళ్ల రోడ్డు వరకు చేపట్టనున్నారు. చెరువు రోడ్డు నుంచి పాత జెండా, శంకర్ లింగం చౌరస్తా, శివాలయం నుంచి హన్‌మాన్ టెంపుల్ వరకు పనులు కొనసాగుతున్నాయి. చాలావరకు ప్రజలు రోడ్డు వెడల్పు కోసం స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు.

మరో మూడు రోడ్ల సర్వేలు

చెరువు నుంచి నీరుకుళ్ల రోడ్డు వరకు విస్తరణ పనులు డ్రైనేజీ నిర్మాణాల పనులు పూర్తయ్యాక రెండవ విడతగా పాత జెండా నుంచి పోచమ్మ దేవాలయం వరకు వెళ్లే రోడ్డును విస్తరించనున్నారు. అలాగే శివాలయం నుంచి గడ్డం అంజయ్య ఇంటి వరకు మరో విస్తరణ చేయనున్నారు. హన్‌మాన్ టెంపుల్ నుంచి జగన్ ఇంటి పక్క నుంచి వేళ్ళే రోడ్డును కూడా విస్తరించనున్నారు.

● ప్రధాన రోడ్ల వెడల్పులపై సర్వే.

సుల్తానాబాద్‌లో అత్యంత ప్రధానమైన రోడ్లుగా పేరొందిన పోలీస్‌స్టేషన్ నుంచి వేణుగోపాల స్వామి టెంపులు మీదుగా పాత జెండా చౌరస్తావరకు ఉన్న రోడ్డును కూడా విస్తరించడంలో భాగంగా శనివారం మున్సిపల్ సిబ్బంది టౌన్ ప్లానింగ్ విభాగం వారు సర్వే చేశారు. అలాగే మున్సిపల్ ఆఫీసు నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా శంకర్ లింగం చౌరస్తా వరకు కూడా రోడ్ల వెడల్పు కార్యక్రమం చేపట్టనున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో పట్టణాభివృద్ధి

- మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు

సుల్తానాబాద్ పట్టణం అభివృద్ధి పట్ల ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే ప్రణాళికలు సిద్ధంచేశారు. ఇందులో భాగంగానే సుల్తానాబాద్‌లో ప్రధాన రోడ్లను అభివృద్ధి చేస్తున్నాము. ఎమ్మెల్యే సహకారంతో ప్రోత్సాహంతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాము. ముఖ్యంగా సుల్తానాబాద్ పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెంది రాకపోకలు పెరిగిపోతున్నాయి. అందుకు తగ్గట్లుగా పట్టణ రోడ్లను విస్తరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోడ్ల విస్తరణతో ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. దశల వారీగా పట్టణంలోని ఐదారు రోడ్లను వెడల్పు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు.

వైభవంగా వాసవీ మాత జయంతి



కన్నాల వేంకటేశ్వరాలయంలో కల్యాణ వేడుకలు



వాసవి మాతకు అభిషేకం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

మంథని, మే 18: స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వాసవి మాత జయంతి వేడుకలను భక్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జయంతోత్సవాలను పురస్కరించుకొని స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో గత నెల రోజులుగా నిత్యం రాత్రి మూడు గంటల పాటు ప్రత్యేక భజన కార్యక్రమాలను కొనసాగించారు. వేద పండితుల ఆధ్వర్యంలో గర్భాలయంలోని మూల మూర్తికి, ఉత్సవ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు వేదోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా హోమం నిర్వహించి పూర్ణాహుతి ఇచ్చారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. అధిక సంఖ్యలో అమ్మవారికి భక్తులకు తీర్థప్రసాదల విరతరణతోపాటు అన్నదానం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి సాయంత్రం నుంచి రాత్రి వరకు పురవీధుల్లో అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంతోపాటు వాసవి మాత జయంతిని పురస్కరించుకుని ఆలయంలో హోమాలు నిర్వహించారు. అమ్మవారికి ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి ఓడిబియ్యం వంటివి సమర్పించి, కుంకుమ పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు, వాసవి మాత ఆలయం నుంచి మహిళలు భక్తులు వేణుగోపాల స్వామిఆలయం మీదుగా పాతబజారు జెండా చౌరస్తా వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం మారుతి, ఆర్య వైశ్య సంఘం పట్టణ కమిటీ అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్, నగునూరి అశోక్, జనార్ధన్, చకిలం సత్తయ్య, అల్లెంకి సత్యనారాయణ, పల్లా కిషన్, తిరుమల్, పల్లా వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండల కేంద్రంలో శనివారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆలయంలో ఆర్యవైశ్యుల కుల దేవత అయిన వాసవి మాత జయంతి వేడుకలను ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకము, మారేడు పత్రితో లక్ష బిల్వార్చన, మామిడిపళ్లతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాఘవులు అశోక్, పలువురు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు



స్విమ్మింగ్ పూల్ మూసివేతపై నిరసన



స్విమ్మింగ్ పూల్ వద్ద బైఠాయించిన చిన్నారులు

యైటింక్లయిన్‌కాలనీ, మే 18: కాలనీలోని స్విమ్మింగ్ పూల్‌ను మూసివేయడం పట్ల చిన్నారులు, కార్మికులు నిరసనకు దిగారు. శనివారం ఈతకు వచ్చిన చిన్నారులు, కార్మికులు స్విమ్మింగ్ పూల్ మూసి ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి వేసవిలో కార్మిక కుటుంబాలు, చిన్నారుల కోసం పాస్‌లు జారీ చేసి స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులో ఉంచేవారని తెలిపారు. ఈ ఏడాది స్విమ్మింగ్ పూల్ నిర్వహణ సక్రంగా లేదని, తరచూ మూసి వేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల సెలవులు ముగిసేవరకు స్విమ్మింగ్ పూల్‌ను సక్రమంగా నడిపించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

యైటింక్లయిన్‌కాలనీ, మే 18: కాలనీ, గోదావరిఖని రహదారిలో రోడ్డు సరిగ్గా లేక ప్రమాదాలు జరుగుతున్న యాజమాన్యం పట్టించోకపోవడం సరికాదని సీఐటీయూ ఆర్జీ-2 సెక్రెటరీ ప్రవీణ్, ప్రెసిడెంట్ వినయ్‌లు ప్రకటనలో పేర్కొన్నారు. కాలనీ నుంచి గోదావరిఖనికి వెళ్లే రోడ్డు ఒకవైపు పూర్తిగా దెబ్బతిన్నదని, వాహనదారులు ఒకవైపు నడిపిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నట్టు తెలిపారు. శనివారం విధులు ముగించుకుని వెళ్తున్న ఇద్దరు కార్మికుల బైక్‌లు ఎదురెదురగా ఢీకొనడంతో ఇద్దరు గాయపడినట్టు తెలిపారు. రోడ్డు మరమ్మత్తులు చేయాలని కోరుతూ ఆర్జీ-2 సీఐటీయూ బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకెళ్ళినా పట్టించుకోలేదని తెలిపారు. నిత్యం కార్మికులకు విధులకు వెళ్లేందుకు ఉపయోగించే రోడ్డు రద్దీతో ఉంటుందని, మరిన్ని ప్రమాదాలు జరగక ముందే రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రవీణ్, వినయ్‌లు డిమాండ్ చేశారు.

కాంట్రాక్టు కార్మికులను ఆదుకోవాలి : ఏఐటీయూసీ

యైటింక్లయిన్‌కాలనీ, మే 18: ఆర్జీ-2 ఏరియాలోని రెండు ప్రైవేట్ కంపెనీలు 32మందిని తొలగించాలని నిర్ణయం తీసుకున్నాయని, వారిని ఆదుకోవాలని ఏఐటీయూసీ ఆర్జీ-2 యాజమాన్యాన్ని కోరింది. శనివారం యూనియన్ నాయకులు ఏరియా అధికార ప్రతినిధిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సోలార్ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్, ఆర్ఐపీఎల్ ఇండ్రీస్‌లలో 32మంది కాంట్రాక్టు కార్మికులు ఎనిమిది ఏళ్ల నుంచి పనిచేస్తున్నట్టు తెలిపారు. యాజమాన్యం ఆయా కంపెనీల నుంచి ఎక్స్‌ప్లోజివ్ సామగ్రి కొనుగోలు చేయడం తగ్గించి, ఎస్ఎంఎస్ కంపెనీ నుంచి కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. దీంతో ఉత్పత్తి తగ్గించిన, 32 మందిని తొలగించనున్నట్టు లెటర్లు ఇచ్చినట్టు పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులను ఆదుకోవాలని, వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపేలా చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాజారత్నం, రవీందర్, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, రవికుమార్, శ్రీనివాస్‌లు ఉన్నారు.



డీజీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

జీఎం కార్యాలయం ఎదుట కన్వేయన్స్ డ్రైవర్ల ధర్నా



కన్వేయన్స్ డ్రైవర్లకు మద్దతు తెలుపుతున్న ఏఐటీయూసీ

రామగిరి, మే 18: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయం ఎదుట శనివారం కన్వేయన్స్ డ్రైవర్లు డిమాండ్ల పరిష్కారానికి ధర్నా చేపట్టారు. వారికి ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలుపుతూ పలు డిమాండ్లపై ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. అందులో టెండర్లలో పేర్కొన్న విధంగా వేతనాలు చెల్లించాలని, సీఎంపీఎఫ్ పేరుతో కోత విధిస్తున్న డబ్బులు డ్రైవర్‌లకు ఇప్పించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు, వివిధ యూనియన్ నాయకులు బుర్ర తిరుపతి, ఎంఆర్‌సీ రెడ్డి, డిటిరావు, గంగాధర్, కొంరయ్య, కన్వేయన్స్ డ్రైవర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగిస్తే ఊరుకోం

శ్రీరాంపూర్, మే 18: ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్య క్షుడు జెట్టి శంకర్‌రావు హెచ్చరించారు. శనివారం ఎస్ఆర్పీ1 గనిని యూనియన్ నాయకులు సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు, ఐఎన్‌టీయూసీకి పెరుగుతున్న ఆదరణను చూసి కొందరు ఓర్వలేకపోతున్నారన్నారు. అటువంటి వారి పై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదుచేసి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. పనిస్థలాల్లో వెంటిలేషన్ సౌకర్యం కల్పించాలని, టూల్‌బాక్స్‌లు ఏర్పాటు చేయాలని, మ్యాన్‌రైడింగ్‌ను నిర్ణీత సమయంకంటే పదినిమిషాల ముందు నడిపించాలని, క్యాంటీన్‌లో మెరుగైన వసతులు కల్పించాలని, రెస్ట్‌హాల్, లాకర్‌ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేనశ్యాం, మైనింగ్‌స్టాఫ్ సింగరేణి ఇన్‌చార్జి తిరుపతిరాజు, కేంద్ర ఉపకార్యదర్శి ల్యాగలశ్రీనివాస్, కార్యదర్శులు కాల్వశ్రీనివాస్, తోకల వెంకటస్వామి, జీవన్‌రావు, పి వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శి మద్దెల వెంకటేష్ పాల్గొన్నారు.

దోస్త్ నుంచి ప్రైవేట్ డిగ్రీ కళాశాల రద్దు

కోల్‌సిటీటౌన్, మే 18: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలను దోస్త్ ప్రక్రియ నుంచి రద్దు చేయడం జరిగిందని, ఏఐఎస్ఎఫ్ పోరాట ఫలితమేనని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల ప్రీతం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల క్రితం అనుమతులు లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలని, దోస్త్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని శాతవాహన యూనివర్సిటీ వీసి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి దోస్త్ ప్రక్రియను నిలిపివేయడం జరిగిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ 6వ డివిజన్ మహిళా కమిటీ ఎన్నిక

కళ్యాణ్‌నగర్, మే 18: రామగుండం కార్పొరేషన్ 6వ డివిజన్ మహిళా కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం డివిజన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా సునీత, ముఖ్య సలహాదారుగా అర్చన, సమన్వయకర్తగా జ్యోత్స్న, ప్రచారకర్తగా వాణిని ఎన్నుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పున్నం తేజ, గోలి నాగేశ్వర్‌రావు, శీలం సదానందం పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు విధిగా చేపించుకొవాలి

- కేవీకే భూసార పరీక్ష అధికారి రుద్రవినాయక్



మాట్లాడుతున్న రుద్రవినాయక్

రామగిరి, మే 18: రైతులు తమ వ్యవసాయ భూములకు భూసార పరీక్షలను విధిగా చేయించుకోవాలని కేవీకే భూసార పరీక్ష అధికారి రుద్ర వినాయక్ తెలిపారు. శనివారం మండలంలోని రత్నాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మట్టి నమూనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతీ రైతు తమ నేల భూసారాన్ని తెలుసుకొని దానికి అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. రైతులు తమ పొలంలోని మట్టిని సేకరించి రామగిరిఖిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రానికి పంపిస్తే అట్టి భూమికి సంబంధించి భూసార పరీక్షలు చేసి భూ ఆరోగ్య పత్రాలను అందజేస్తామని తెలిపారు. మట్టి సేకరించే విధానానికి 8001804016కి కాల్ చేసి సమాచారం అందుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ జ్యోతి, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి

- పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి

పెద్దపల్లి రూరల్, మే 18 : మండలంలోని గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి సూచించారు. శనివారం మండలంలోని చీకురాయి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాల్లో వేసవికాలం దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని, వాతావరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా రోగాలు వచ్చే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. సమావేశంలో ఎంపీవో సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి రాధ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, మే 18: మండలంలోని పాలితం గ్రామానికి ఆలేటి భూమయ్య ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి మృతి చెందగా బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష వారి కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను కుటుం సభ్యులను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, మహిళలు ఉన్నారు.

నిరూపయోగంగా వాటర్ ఫ్రీజర్



ఉపయోగంలో లేని ఫ్రీజర్

ఓదెల, మే 18: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొన్ని రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు స్మారకార్థం ఏర్పాటు చేసిన వాటర్ ఫ్రీజర్ ఉపయోగం లేకుండా పోయింది. కుటుంబ సభ్యులు దాదాపు 20 వేల రూపాయలతో కొనుగోలు చేసి ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వాటర్ ఫ్రీజర్‌కు విద్యుత్ ఎర్త్ రావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కనీసం ఎర్త్ విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

ఎలిగేడు, మే 18: మండలంలోని శివపల్లి గ్రామంలో శనివారం అదే గ్రామానికి చెందిన దుగ్యాల వెంకట్‌రావుకు చెందిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో మృతిచెందాయి. బాధిత రైతు వెంకట్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం గేదెలను మేతకు వదిలిపెట్టారు. రాత్రి అధికంగా వీచిన గాలిదుమారానికి 11కేవి విద్యుత్ వైర్లు తెగిపోయి ఉన్నాయని వాటికి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే రెండు పాడి గేదేలు మృతి చెందాయి. సుమారు వీటి విలువ రూ.1.50వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేశారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

జూలపల్లి, మే 18: మండల రైతులకు అవసరమైన జీలుగ విత్తనాలు ప్రభుత్వ సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ప్రత్యూష ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు 30కిలోల బ్యాగుకు 1,116 రూపాయలు చెల్లించి తీసుకోవాలని ఏవో ప్రత్యూష పేర్కొన్నారు.

సబ్బితంలో శ్రీ గీతాహవన యజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న గ్రామస్థులు

పెద్దపల్లి రూరల్, మే 18: మండలంలోని సబ్బితం సీతారామాంజనేయ నవగ్రహిత ఆలయంలో శనివారం శ్రీహరి మౌన స్వామిజీ సమక్షంలో నవమ హోమ కుండలాలతో శ్రీగీతాహవన యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వశాంతికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యజ్ఞంలో సబ్బితం గ్రామస్థులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గీత సత్సంగ్ సభ్యులు, మాజీ సర్పంచ్ సదయ్య, తిరుపతి, రమేష్, సతీష్, కనుకయ్య, రవి, గుమ్మడి ప్రసాద్ పాల్గొన్నారు.

అడవిపందిని వేటాడిన వ్యక్తి అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ, మే 18: వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అడవి పందిని వేటాడి తరలిస్తున్న వ్యక్తి పట్టుబడ్డాడు. శనివారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు జూలపల్లి వెళ్లే రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆసమయంలో అటుగా బైక్‌పై వచ్చిన ఆవుల రాజేందర్ పోలీసులను గమనించి తప్పించుకో బోగా పట్టుకుని తనిఖీ చేశారు. చంపబడ్డ అడవి పందిని గుర్తించారు. రాజేందర్‌ను అదుపులోకి తీసుకుని మంథని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్టు సీఐ బీ రవీందర్ తెలిపారు.